## బీజేపీ డివిజన్ అధ్యక్షుల నియామకం

బర్కత్‌పుర, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని నాలుగు డివిజన్లకు నూతన అధ్యక్షులను నియమించినట్లు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ జె.శ్రీకాంత్, కో-రిటర్నింగ్ ఆఫీసర్లు పందిర్ల ప్రసాద్, చిట్టి శ్రీధర్ తెలిపారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు నియామకం త్వరలో ప్రకటిస్తామన్నారు. కాచిగూడ డివిజన్ అధ్యక్షుడిగా టి.బల్వీర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా కె.కృష్ణకుమార్, నల్లకుంట డివిజన్ అధ్యక్షుడిగా కె.ప్రశాంత్ జోషి, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా కేబీ.నర్సింగ్‌రావు, గోల్నాక డివిజన్ అధ్యక్షుడిగా ఎస్.శ్రీధర్‌గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా వై.దామోదర్‌నాయుడు, అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడిగా సీహెచ్.నరేష్‌గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా దాసోజు నాగభూషణంచారి నియమితులైనట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని శ్రీనగర్‌కాలనీ అధ్యక్షులుగా జి.అనంతలక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా హరీష్‌యాదవ్, నాంపల్లి నియోజకవర్గంలోని మోహిదీపట్నం డివిజన్ అధ్యక్షుడిగా చింతల రాజేష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా జనార్దన్‌రావు, మల్లేపల్లి డివిజన్ అధ్యక్షుడిగా పి.చంద్రశేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా జి.జగన్నాథంరాజు ఎన్నికైనట్లు వెల్లడించారు.

## నేటి నుంచి శిల్పారామంలో సంక్రాంతి సంబురాలు

మాదాపూర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు సంక్రాంతి సంబురాలు జరగనున్నాయి. పల్లె వాతావరణంలో గంగిరెద్దులు, హరిదాసులు, బుడబుక్కల, జంగమదేవరులు, పిట్టలదొర, ఎరుకలసాని విన్యాసాలతో పాటు సందర్శకులు సందడి చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ కిషన్‌రావు తెలిపారు. భోగి పండుగను పురస్కరించుకుని సాయంత్రం 5 గంటలకు చిన్న పిల్లలకు భోగిపళ్ల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పలు సాంస్కృతి కార్యక్రమాలు, భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రవి కూచిపూడి శిష్య బృందం మూషిక వాహన, వినాయక కౌతం, జతిస్వరం, అన్నమాచార్య కీర్తన, రామదాసు కీర్తన, గరుడ గమన తదితర అంశాలపై చక్కటి ప్రదర్శనతో సందర్శకులను కట్టిపడేశారు.

## షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

యూసుఫ్‌గూడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్‌లో ఆదివారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. రహ్మత్‌నగర్ న్యూటన్ హైస్కూల్ వెనుక వీధిలో సంతోషి కుమారి నివాసం ఉంది. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇంట్లో ఒక్కసారిగా మంటలు రావడంతో కుటుంబ సభ్యులు బయటకు పరుగుతీశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని పది లక్షల రూపాయల విలువైన సామగ్రి బుగ్గిపాలైందని బాధితురాలు వాపోయింది. సమాచారం అందుకున్న నగర కాంగ్రెస్ నాయకులు వి.నవీన్‌యాదవ్ బాధితురాలిని పరామర్శించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



వైఏసీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మీనారాయణ

## అవినీతిని యువత ప్రశ్నిస్తేనే మంచి సమాజం

● సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

హైదరాబాద్ సిటీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత చట్టాలపై అవగాహన పెంచుకుంటూ అవినీతిని ప్రశ్నించినప్పుడే మంచి సమాజం ఏర్పడుతుందని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ (వైఏసీ) ప్రధాన సలహదారులు, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ క్యాలెండర్‌ను ఎర్రమంజిల్‌లోని వైఏసీ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. యువతరం చెడు అలవాట్లకు బానిస కాకుండా అవినీతి రహిత సమాజంలో భాగస్వామ్యులు కావాలన్నారు. సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను గమనిస్తూ వాటి నిర్మూలనకు కృషి చేయాలన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ చేస్తున్న వినూత్న కార్యక్రమాలలో యువత తమ పాత్ర పోషించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి, కోర్ కమిటీ సభ్యులు కొమటి రమేశ్ బాబు, డి.రాకేశ్ పాల్గొన్నారు.

# ఊరెళ్తే మాకు చెప్పండి

● నగరవాసులకు పోలీసుల సూచన
● తాళం వేసిన ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తామని భరోసా
● చోరీల కట్టడికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడి

బంజారాహిల్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి నగర వాసులు ఊరుబాట పడుతుండటంతో చోరీ ఘటనలు పెరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో పోలీసులు పలు సూచనలు చేస్తున్నారు. ఊరెళ్లే వారు తమకు సమాచారం ఇవ్వడంతో పాటు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పోలీసులు చెబుతున్నారు. పండుగ సందర్భంగా పోలీసులు తీసుకుంటున్న జాగ్రత్తలను వివరించారు. ఆయా ఠాణాల పరిధిలోని బంజారాహిల్స్, ఇందిరానగర్, ఎన్‌బీటీనగర్, నవోదయకాలనీ, యూసుఫ్‌గూడ, ఎమ్మెల్యే కాలనీ, శ్రీనగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో చోరీలు జరిగే అవకాశాలు ఉండటంతో ప్రత్యేక దృష్టి పెట్టినట్లు డీఐ తెలిపారు. ఇందులో కొన్ని ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి అక్కడ గస్తీని ముమ్మరం చేస్తున్నట్టు వివరించారు. సిబ్బందికి అదనపు బాధ్యతలను అప్పగించినట్టు తెలిపారు. సెక్టార్ల వారీగా ఎస్సైలను అప్రమత్తం చేయడంతో క్రైంటీం బలగాలు నిరంతరంగా గస్తీ తిరుగుతాయన్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లలో సాధరణంగా తెల్లవారుజామున చోరీలు జరుగుతుంటాయని.. అందువల్ల అర్ధరాత్రి 2 నుంచి ఉదయం 7 వరకు గంటకోసారి పెట్రోలింగ్ నిర్వహించేలా ఏర్పాటు చేసినట్టు పోలీసులు వెల్లడించారు.

### జాగ్రత్తలు తీసుకుంటే మంచిది

సంక్రాంతికి నగరవాసులు పల్లెబాట పడతారని దొంగలకు అవగాహన ఉండటంతో వారు ఈ సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్ల వద్ద రెక్కీ నిర్వహిస్తూ ఉంటారు. అవకాశం దొరకగానే దోచేస్తారు. అందుకే నగర వ్యాప్తంగా జనవరి మాసంలో చోరీల కేసులు అధికంగా ఉంటాయి. మారిన పోలీసింగ్ విధానంతో దొంగలు వెంటనే దొరుకుతున్నప్పటికీ నేరం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే బాగుంటుందని పోలీసులు అంటున్నారు. కాలనీల్లో ఇలాంటి చోరీలు అధికంగా జరుగుతుంటాయని తెలిపారు.

### ఈ సూచనలు పాటించండి

- ఊరెళ్లే వారు ఠాణాలో తమ పూర్తి వివరాలను అందించాలి. అలా ఇచ్చివెళ్లే వారి ఇళ్లపై ప్రత్యేక దృష్టి పెడతాం.
- ఇంట్లో ఎలాంటి విలువైన ఆభరణాలు ఉంచొద్దు. బ్యాంకు లాకర్లో పెట్టి వెళ్లడమో.. లేదంటే తమ వెంట తీసుకువెళ్లడమో చేయాలి.
- ఇంటి యజమానుల చుట్టుపక్కల వారికి చెప్పి వెళ్లడం మంచిది. దీంతో వారు ఇంటిపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది.
- ద్విచక్రవాహనాలు ఉంటే ఇంటిలోపల పెట్టుకోవాలి.
- ఇంటిలోపల విద్యుత్తు సరఫరాను నిలిపివేసి వెళ్లాలి. ఇలాచేస్తే షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలను నివారించవచ్చు.
- వీలైతే సీసీ కెమెరాను ఏర్పాటు చేసుకోవాలి. ఒకవేళ దొంగతనం జరిగినా నిందితులను పట్టుకునే అవకాశం ఉంటుంది.
- ఎవరైనా దొంగలను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఎలాంటి ఇబ్బంది ఎదురైనా 100కు కాల్ చేయాలి.



### అదనపు సిబ్బందిని సమకూర్చుకుంటున్నాం



సంక్రాంతి నేపథ్యంలో సెలవులకు చాలా మంది ఊరెళ్తున్నారు. ఈ సమయంలో దొంగలు రెచ్చిపోయే అవకాశం ఉంది. అందుకే ఊరెళ్లే వారు పీఎస్‌లో సమాచారం ఇవ్వాలి. తమకు చెప్తే అదనపు సిబ్బందిని సమకూర్చి ఆయా ఇళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ప్రతిరోజూ వారి ఇళ్లను కానిస్టేబుళ్లు సందర్శిస్తారు.

- వెంకటేశ్వర్ రెడ్డి, జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్

### రక్షణపై దృష్టి సారించాలి



ఊరెళ్లే వారు స్వీయ రక్షణపై దృష్టి సారించాలి. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఇంట్లో ఉన్న బంగారం, డబ్బు లాంటి విలువైన వస్తువులను బ్యాంకులో పెట్టుకోవడం మంచిది. తాళాలు వేసి ఉన్న ఇళ్లపై మా సిబ్బంది ప్రత్యేక దృష్టి సారిస్తారు.

- కేఎం రాఘువేంద్ర, బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్

## వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడు అపహరణ

దుండిగల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చి వెళ్తున్న వృద్ధురాలికి మాయమాటలు చెప్పి ఆమె మెడలోని పుస్తెలతాడు లాక్కెళ్లిన వక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బౌరంపేట గ్రామానికి చెందిన చింతకింది శంకరమ్మ (65) బౌరంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో ఓ వ్యక్తి మాటలు కలిపి బైక్‌పై ఇంటి వద్ద దించుతానని నమ్మించాడు. కొంతదూరం తీసుకువెళ్లి మెడలో ఉన్న ఐదు తులాల పుస్తెలతాడు లాక్కుని వెళ్లిపోయాడు. ఘటనపై శంకరమ్మ కుటుంబ సభ్యులు దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాజేంద్రనగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేటు విద్యా సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసే శివకుమార్ (26) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లికి చెందిన శివకుమార్‌కు ఏడాది క్రితం వివాహమైంది. శివకుమార్ శనివారం రాత్రి 10 గంటల సమయంలో బుద్వేల్‌లో ఉండే స్నేహితుడి ఇంటికి వెళ్తున్నట్లు తన భార్యకు చెప్పి బైక్‌పై బయలుదేరాడు. రాత్రి రెండు గంటల వరకు స్నేహితుడి ఇంట్లో ఉండి తిరిగి ఉప్పర్‌పల్లి వెళ్తుండగా వెటర్నరీ కళాశాల సమీపంలో డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



మనవడు, మనవరాళ్లతో కలిసి గాలి పటాలు ఎగురవేస్తున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్‌యాదవ్



జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ క్లబ్‌లో కైట్ ఫెస్టివల్‌లో సందడి చేస్తున్న క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, కిలారు రాజేశ్వరరావు

# కాలనీల్లో మొదలైన సంక్రాంతి సందడి

బంజారాహిల్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీల్లో సంక్రాంతి సందడి నెలకొంది. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మనవడు, మనవరాళ్లతో కలిసి గాలిపటాలు ఎగుర వేస్తూ సందడి చేశారు. జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ క్లబ్‌లో కైట్ ఫెస్టివల్, రంగోలి నిర్వహించారు. ఎప్పుడూ బీజీగా ఉండే కాలనీవాసులు ఆటవిడుపుగా గాలిపటాలు ఎగురవేస్తూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. మహిళలు రంగోలి పోటీల్లో ముగ్గులతో సందడి చేశారు. క్లబ్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కిలారి రాజేశ్వరరావు, కొల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో రంగోలి వేడుకలు ఘనంగా జరిగాయి. సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడ హనుమాన్ దేవాలయం వద్ద కార్పొరేటర్ వనం సంగీతాశ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.

యూసుఫ్‌గూడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ ఎస్పీఆర్ హిల్స్ గ్రౌండ్‌లో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు మహిళలు, యువతులు పెద్దఎత్తున తరలివచ్చి ముగ్గులు వేశారు. ప్రథమ బహుమతి నాగవేణి, ద్వితీయ బహుమతి సరిత, మూడో బహుమతి ఉమాశి, నాలుగవ బహుమతి శివరాణి అందుకుంది. విజేతలకు కార్పొరేటర్ సీఎన్ రెడ్డి బహుమతులు అందించారు.



ఎస్పీఆర్ హిల్స్ గ్రౌండ్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

## గాలి వినోద్‌కుమార్‌కు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మద్దతు

పంజాగుట్ట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ పోటీ చేస్తారని, ఆయనకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ ప్రకటించింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్, ప్రధాన కార్యదర్శి చవాన్ సుభాన్ సింగ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కుర్రి చంద్రశేఖర్ మాట్లాడారు. తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న వినోద్ కుమార్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తారని వెల్లడించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు యాదయ్య ముత్యాల, మన్నె హేమచంద్ర, రత్నం, దుర్గయ్య, సురేష్, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'కేసీఆర్‌కు ప్రతిపక్ష నాయకుడి హోదా తొలగించాలి'

పంజాగుట్ట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి, ప్రజల్లోకి రాని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు ప్రతిపక్ష నాయకుడి హోదా తొలగించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి రవీంద్రనాయక్ ధరావత్ డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్, హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ



రైటప్‌లు: తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.మల్లయ్య ఆధ్వర్యంలో రూపొందించిన సంఘం నూతన క్యాలెండర్‌ను మంత్రి దామోదర రాజనర్సింహ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం రాజ్‌కుమార్ గంగపుత్ర, నాయకులు మోహనకృష్ణ, గడప దేవేందర్, రాజేష్ పాల్గొన్నారు.

- ఎర్రగడ్డ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి)

# స్వామి వివేకానందకు ఘన నివాళి

బంజారాహిల్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫిలింనగర్‌లో ఆయన చిత్రపటం వద్ద ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు, కాంగ్రెస్ నాయకులు నగేష్‌సాగర్, ఆకుల రాజు తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని, భారతీయ సంస్కృతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన ఘనత స్వామి వివేకానందకే దక్కుతుందన్నారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎల్లారెడ్డిగూడలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు అంతారం శాంతికుమార్, హరీష్‌యాదవ్, నరేందర్‌యాదవ్, అజయ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

### సోమాజిగూడలో..

బేగంపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మహనీయుల బోధనలు దేశంలోని యువతకు ఆదర్శమని బీజేపీ సోమాజిగూడ డివిజన్ అధ్యక్షుడు సూర్య వినాయక్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా సోమాజిగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత వివేకానందుడి అడుగుజాడల్లో నడవాలన్నారు. కృష్ణారెడ్డి, రాహుల్, మహేష్, గోపి పాల్గొన్నారు.



కల్యాణ్‌నగర్ వెంచర్ 3లో నివాళులర్పిస్తున్న కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పీవీ రవిశేఖర్ రెడ్డి, వివేకానంద యూత్ అసోసియేషన్ సభ్యులు



స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు, నగేష్ సాగర్ తదితరులు



వివేకానంద జయంతి వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు అంతారం శాంతికుమార్, హరీష్ తదితరులు



స్వామి వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేత సూర్యవినాయక్ తదితరులు



కల్యాణ్‌నగర్‌లోని వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగళ్ల నరసింహారావు, సభ్యులు బీవీఆర్ చౌదరి, తుమ్మల రాధిక, వేణుగోపాల్, శ్రీనివాస్, రమేష్ తదితరులు

## 'లక్ష డప్పులు-వెయ్యి గొంతులను విజయవంతం చేయాలి'

పంజాగుట్ట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేయాలని జాతీయ ఎంబీసీ, డీఎన్టీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. వర్గీకరణకు తమ పూర్తి మద్దతు ఉంటుందని సంఘం నాయకులు ప్రకటించారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా జాతీయ ఎంబీసీ, డీఎన్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎంబీసీ డీఎన్టీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ.. పీడిత బడుగు బలహీనవర్గాలకు అండగా ఉంటూ వారికి న్యాయం జరిగే వరకు ఎమ్మార్పీఎస్ పోరాడిందన్నారు. ఫిబ్రవరి 7న వర్గీకరణ అమలు కోసం నిర్వహించే లక్ష డప్పులు, వెయ్యి గొంతుల ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



పీజేఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన్‌యాదవ్, బాబాగౌడ్ తదితరులు



ఎస్పీఆర్ హిల్స్ పీజేఆర్ టెంపుల్ వద్ద కేక్ కట్ చేస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తదితరులు

# పీజేఆర్ జయంతి వేడుకలు

బంజారాహిల్స్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్‌లో దివంగత నేత పీజేఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆయన జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఈ విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన్‌యాదవ్, బాబాగౌడ్, యాదయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### బోరబండలో..

బోరబండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎల్పీ నాయకుడు దివంగత పి.జనార్దన్ రెడ్డి జయంతి వేడుకలను బోరబండలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బోరబండ బస్టాప్‌లో జరిగిన కార్యక్రమంలో బి.అశోక్, కాసుల మహేష్, రవీందర్, ఖయ్యూమ్, బాలరాజ్, సుధాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొని నివాళులర్పించారు.

### బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో..

బోరబండ డివిజన్ పరిధిలోని ఎస్సార్టీ నగర్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పీజేఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణమోహన్, పవనం శివశంకర్, దశరథ్, శ్రీధర్‌రెడ్డి, ధనవీర, ఠాగూర్, తిరుపతి, లక్ష్మణ్‌మూర్తి, రాము, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### విజయారెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి ఆధ్వర్యంలో ఖైరతాబాద్ గ్రంథాలయ చౌరస్తాలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో అవసరం ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరాన్ని విజయారెడ్డి ప్రారంభించగా స్థానికులు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

### ఎస్పీఆర్ హిల్స్‌లో..

యూసుఫ్‌గూడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచి వారి జీవితాలల్లో వెలుగులు నింపేందుకు నిరంతరం కృషి చేసిన గొప్ప ప్రజానేత పీజేఆర్ అని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ అన్నారు. ఆదివారం పీజేఆర్ జయంతి సందర్భంగా నగర కాంగ్రెస్ కార్యదర్శి భవానీశంకర్ ఆధ్వర్యంలో ఎస్పీఆర్ హిల్స్‌లోని పీజేఆర్ టెంపుల్ వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, తెలంగాణ స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ మహమ్మద్ అసదుద్దీన్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామి, రాష్ట్ర వడ్డెర ఐక్య వేదిక అధ్యక్షులు వేముల యాదయ్య, కిరణ్‌యాదవ్ పీజేఆర్ టెంపుల్‌లో పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు.



ఎస్సార్టీ నగర్‌లో పీజేఆర్ విగ్రహానికి నివాళులర్పించిన బీఆర్‌ఎస్ నాయకులు


విజేతలు, చిన్నారి చిత్రకారులతో నిర్వాహకులు

## విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

రాంగోపాల్‌పేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): చిత్రలేఖనం విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందిస్తుందని వాల్‌ఆర్ట్ పెయింటింగ్, డ్రాయింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ బొబ్బిలి శశిధర్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ సర్దార్ పటేల్ రోడ్డులోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యలయ ఆవరణలో డ్రాయింగ్, పేయింటింగ్ పోటీలను నిర్వహిచారు. ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని ల్యాండ్ స్కేప్, కైట్ ఫెస్టివల్ థీమ్‌లపై డ్రాయింగ్, పేయింటింగ్‌ద్వారా గాసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శశిధర్ రెడ్డి మాట్లాడుతూ పెయింటింగ్ వల్ల విద్యార్థుల్లో సరికొత్త ఆలోచనలు ప్రయోగాలు చేయడానికి ఉపయోగ పడతాయన్నారు. పోటీలలో ఒక్కో విభాగం నుంచి మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి బంగారు, రజత, కాంస్య పతకాలను, ప్రశంసా పత్రాలను అందజేశారు.


వేల గొంతులు లక్ష డప్పులు సన్నాహక కమిటీ సమావేశం

## ఎస్సీ వర్గీకరణ వెంటనే చేయాలి: మేధావులు

తిరుమలగిరి జనవరి 12 (ఆంధ్రజ్యోతి): భారతదేశ అత్యున్నత న్యాయ స్థానం ఎస్సీ వర్గీకరణ చేయాలని ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని మేధావులు డిమాండ్ చేశారు. బొల్లారం పెన్షన్‌పురలో చిన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెయ్యి గొంతులు లక్ష డప్పులు సన్నాహక కమిటీ సమావేశంలో పలువురు మేదావులు మాట్లాడారు. లక్ష డప్పులు వేల గొంతులు ఫిబ్రవరి 7న జరగనున్న సమావేశానికి మాదిగ సామాజిక వర్గం పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కంటోన్మెంటు బోర్డు మాజీ ఉద్యోగా పరశురాం, శ్రీకిషన్ మాదిగ, అజిత్ కల్యాన్, సుదర్శన్, మిలిటరీ రమేష్, బాలరాజ్, పరమేష్, కేపి.శ్రీనివాస్, శత్రు తదితరులు ఉన్నారు.


గురుగోవింద్‌సింగ్ జయంతితో పాల్గొన్న సిక్కులు

## ఘనంగా గురుగోవింద్‌సింగ్‌జీ జయంతి

సికింద్రాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సిక్కుల పదో గురువు, ఖాల్సా పంత్ వ్యవస్థాపకులు గురుగోవింద్‌జీ 358 జయంతి ఉత్సవాలు కనులపండువగా సాగాయి. బాలంరాయి క్లాసిక్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన వేడుకలకు జంటనగరాల నుంచి అధిక సంఖ్యలో సిక్కులు తరలివచ్చారు. సికింద్రాబాద్ గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో విశాల్‌దీవాన్ సాముహిక ప్రార్ధనలు నిర్వహించారు. గురుగోవింద్ సింగ్‌జీ బోధనలను ఈ సందర్భంగా వివరించారు. సికింద్రాబాద్ గురుద్వారా ప్రబంధక్ కమిటీ అధ్యక్షులు ఎస్.బల్దేవ్‌సింగ్‌బగ్గా, ప్రధాన కార్యదర్శి ఎస్.జగ్మోన్‌సింగ్, ఉపాధ్యక్షులు ఎస్.హర్‌ప్రీతిసింగ్‌గులాటి తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న గురుస్వామి రమేష్, అయ్యప్ప స్వాములు

## అయ్యప్పస్వామి బంగారు ధనుర్బాణాలు

బౌద్ధనగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ షైలార్‌గడ్డకు చెందిన జ్ఞానేశ్వరీ క్యాటరర్స్ అధినేత, బీజేపీ రాష్ట్ర ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి అకారం రమేష్ గురుస్వామి, తనయుడు అఖిల్‌రాజ్ శబరిమల అయ్యప్పస్వామి ఆలయానికి పదకొండు తులాల బంగారు ధనుర్బాణాలు, రెండు వెండి ఏనుగులను వితరణగా ఇచ్చారు. ఆలయ నిర్వాహకులు బంగారాన్ని, వెండిని రమేష్‌గురుస్వామి అందజేశారు.

## క్రైస్తవులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి

- సీయస్‌యస్ క్రైస్తవ సంఘం జాతీయ నాయకుడు యోహాన్

చిలకలగూడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులకి మెరుగైన సదుపాయాలు సౌకర్యాలు కల్పించాలని సీయస్‌యస్ క్రైస్తవ సంఘం జాతీయ నాయకుడు పి.వి.యోహన్ డిమాండ్ చేసారు. మెట్టుగూడలో ఆదివారం చట్ట బద్ధ క్రైస్తవుల చర్చ వేదిక నిర్వహించారు. సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలని, ప్రతి నియోజకవర్గంలో 5 ఎకరాల సమాధులకి కేటాయించాలని, పాస్టర్స్‌కి రూ.10 వేల గౌరవ వేతనం చెల్లించాలని, విదేశ విద్య కోసం ప్రస్తుతం అందజేస్తున్నది 35 లక్షలకి పెంచాలని, క్రైస్తవుకి ప్రత్యేక కాలేజీలు యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో థామస్, ఏసయ్య, డేవిడ్, సరోజ బెనర్జీ, జాన్, విలియం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బోయిన్‌పల్లి, జనవరి 12 (అంధ్రజ్యోతి): బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తొర్లికొండ దినేష్ కుమార్(20)అనే యువకుడు మృతి చెందినట్లు బోయినపల్లి ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మృతుడు అమీర్‌పేటలోని ఒక బట్టల షాపులో పనిచేస్తుంటాడు. రోజూలాగే తన మిత్రుడితో కలిసి అల్వాల్‌లోని తన ఇంటికి బైక్‌పై వెళ్తున్న సమయంలో అదుపుతప్పి కింద పడిపోగా.. వెనుక నుంచి వస్తున్న లారీ అతనిపై నుంచి వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని లారీని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మాహత్యాయత్నం

- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి




సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిన ఘటన సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం సీతాఫల్‌మండి ఏ క్యాబిన్ వద్ద గుర్తుతెలియని 45 ఏళ్ల వ్యక్తి ఔరంగబాద్ నుంచి గుంటూరుకు వెళ్లే రైలు కింద పడి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బలమైన గాయాలపాలై రైలు పట్టాల పక్కన పడిఉంటే సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఇతడిని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచారు. కేసు దర్యాప్తుల్లో ఉంది.

# దయచేసి వినండి.. క్యూ పాటించండి

- రైల్వేస్టేషన్‌లో పోలీసుల సూచనలు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడకకూడదని ప్రయాణికులు రైలు ఎక్కే సమయంలో క్యూ పద్ధతిని పాటించాలని జీఆర్‌పీ పోలీసులు సూచలిస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్ గౌడ్ పర్యవేక్షణలో జీఆర్‌పీ పోలీసులు రైలు ప్లాట్ ఫాంపైన ఆగగానే క్యూ పద్ధతిలో ఎక్కాలని సూచిస్తూ ప్రయాణికుల్ని రైలు ఎక్కిస్తున్నారు. తోపులాటలు ఘర్షణలు రిజర్వేషన్ బోగిలో సాధరణ ప్రయాణికుల్ని ఎక్కకుండా సూచనలిస్తు జీఆర్‌పీ పోలీసులు సూచనలిస్తున్నారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ పెరగడంతో ఎలాంటి చోరీలు జరుగకుండా క్రైమ్ కానిస్టేబుళ్లు మఫ్టీలో విధులు నిర్వహిస్తున్నారు. అనుమానిత ప్రయాణికుల లగేజీలను జీఆర్‌పీ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు.


రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ


క్యూ పద్ధతిలో రైలు ఎక్కిస్తున్న జీఆర్‌పీ పోలీసులు

## సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాలి


ముగ్గులను తిలకిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, సంతోష్ యాదవ్


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న రామకృష్ణ

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

మారేడుపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతి ప్రతిబింబిచేలా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ఆదివారం మారేడుపల్లి షెనాయ్ క్రీడా మైదానంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ సి.సంతోస్ యాదవ్, లక్ష్మీప్రియ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రంగురంగుల ముత్యాల చుక్కల ముగ్గులను ఎమ్మెల్యే తిలకించారు. న్యాయనిర్ణేతగా గ్రీస్ మనీ విచ్చేసారు. మొదటి బహుమతి వాషింగ్ మిషన్, రెండో బహుమతి కుట్టు మిషన్, మూడవ బహుమతి మిక్సీతో పాటు క్యాష్ ప్రైస్‌ను సంతోష్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే శ్రీగణేష్ విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్ యాదవ్, మల్లేష్ యాదవ్, సుధీర్ కుమార్, అరవింద్ కుమార్, శ్రీనివాస్ శివ, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మన ఆచారవ్యవహారాలు, సంస్కృతీ సాంప్రదాయాలను పరిరక్షిస్తూ, భావితరాలకు అవగాహన కలిగించవలసిన అవశ్యకత ఎంతైన ఉందని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. మూడోవార్డులోని దోభీఘాట్ వద్ద ఉన్న డబుల్‌బెడ్ రూం ఇళ్ల సముదాయంలో ఆదివారం బీజేపీ మహంకాళి అధికార ప్రతినిధి బీఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల విజేతలకు ఆయన బహుమతి ప్రధానం చేశారు. అనంతరం మాట్లాడుతూ సంక్రాంతి పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించినందుకు పార్టీ నాయకులను అభినందించారు. భాగ్యలక్ష్మీ, వైశాలి, బీజేపీ మహిళా నాయకులు పాల్గొన్నారు.


చీరలు పంపిణీ చేస్తున్న జంపన ప్రతాప్, దేవేందర్ తదితరులు

## ఘనంగా పీజేఆర్ జయంతి

సికింద్రాబాద్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పీజేఆర్ జయంతి వేడుకలను జేబీఎస్ చౌరస్తాలో ఆదివారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డీబీ.దేవేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సంక్షేమం కోసం పీజేఆర్ నిరంతరం పాటుపడ్డారని, పేదల పక్షపాతిని అన్నారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, జమీల్, ప్రభుగుప్తా, అన్నానగర్ మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మన్నె సుబ్రహ్మణ్యం సంస్మరణ సభ

తార్నాక, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కమ్మ సామాజికవర్గ సంక్షేమానికై మన్నె సుబ్రహ్మణ్యం చేసిన సేవలు అభినందనీయమని తార్నాక కమ్మ సంఘం నాయకులు, మన్నె మిత్రబృందం సభ్యులు కొనియాడారు. ఆదివారం తార్నాకలోని మర్రి కృష్ణారెడ్డి హాల్లో మన్నె నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మన్నె సుబ్రమణ్యం సంస్మరణ సభను నిర్వహించారు. సంస్మరణ సభను పురస్కరించుకుని తార్నాక కమ్మ సంఘం నాయకులు, మన్నె మిత్రబృందం సభ్యులు మన్నె సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న కమ్మ సంఘాల నాయకులు


బహుమతి ప్రదానం చేస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర

## మన సంస్కృతిని కాపాడాలి: కార్పొరేటర్

రాంగోపాల్‌పేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సాంప్రదాయలను కాపాడుకునేందుకే రంగవల్లి కార్యక్రమాలను చేపట్టిన విశ్వకర్మ సంఘం వారికి అభినందనలని రామ్‌గోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని విశ్వకర్మ సంఘ భవనంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఆమె హాజరై బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలోని సృజనాత్మక శక్తిని వెలుగుతోకి తేవడానికి ఇలాంటి పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి భాస్కరాచారి, కోశాధికారి బోనా శ్రీనివాస్ చారి, ఉపాధ్యక్షులు చక్రపాణి, సంఘం సాంఘిక సంక్షేమ శాఖ చైర్మన్ బౌరంపేట వీరచారి, ఇతర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం ప్రాధాన కార్యదర్శి దుబ్బాక కిషన్ రావు, బీజేపీ నాయకులు జయ, విజయ లక్ష్మీ, నరేంద్ర పాల్, గోపీ కిషన్ ఉపాధ్యాయ్ తదితరులు పాల్గొన్నారు.


బోయగుడాలో ముస్లిం సోదరులు నిర్వహించిన గ్యార్వీ కార్యక్రమానికి హాజరైన తలసాని శ్రీనివాస్ యాదవ్

## బోయగూడలో గ్యార్వీ ఉత్సవాలు

పద్మారావునగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ న్యూబోయగూడలోని కళారంగ్ బస్తీవద్ద ఆదివారం గ్యార్వీ ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గౌస్ ఏ పాక్ చిల్లా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్పొరేటర్ కుర్మ హేమలత, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్, వెంకటేశన్‌రాజు, లక్ష్మీపతి, ఏసూరి మహేశ్, ఫహీం, అస్లాం, మూర్తుజా, జావేద్, ఆయూబ్, గౌసియాబేగం, సాజిదాలు పాల్గొన్నారు.


స్వామి వివేకానంద జయంతిలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ప్రతినిధులు


స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేస్తున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్ కన్నన్


స్వామి వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి తదితరులు

# స్వామి వివేకానంద స్ఫూర్తి యువతకు ఆదర్శం

- ఎంపీ ఈటల రాజేందర్

మారేడుపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద చూపిన మార్గంలో యువత నడవాలని మల్కాజిగిరి పార్లమెంట్ మెంబర్ ఈటల రాజేందర్ అన్నారు. స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం జేబీఎస్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి ఎంపీ ఈటల రాజేందర్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామకృష్ణ, హైకోర్టు రిటైర్డ్ జడ్జీలు చంద్రయ్య, సీఎస్ నారాయణ, హైకోర్టు సీనియర్ న్యాయవాది నాగుల శ్రీనివాస్ యాదవ్ పలువురు జయంతి వేడుకల్లో పాల్గొని పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ స్వామి వివేకానంద యువతకు ఎంతో స్ఫూర్తి దాయకరమైన ఆలోచన విధానాలు అందించిన ఘనత ఆయనకే దక్కిందని, వాటిని అందరూ ఆచరించాలని సూచించారు. కార్యక్రమంలో గాంధీయన్ స్కూల్స్ ప్రిన్సిపాల్ ఆనంద్ ప్రభు, అసోసియేషన్ ప్రతినిధులు ప్రకాష్ బాబు, సురేందర్ యాదవ్, మహేష్, అంజయ్య, విష్ణు కుమార్, బలరాం, సురేందర్, జనార్ధన్, నాయకులు, భానుక మల్లిఖార్జున్, విజయరామరాజు, బిఎన్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### బొల్లారంలో

తిరుమలగిరి జనవరి 12 (ఆంధ్రజ్యోతి): భారత జాతి గొప్పతనాన్ని సంస్కృతిని విదేశాలకు తెలిపిన మహనీయుడు స్వామి వివేకానంద అని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్ కన్నన్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం బొల్లారంలోని వివేకానందనగర్ కాలనీలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1893 సెప్టెంబర్ 11వ తేదీన స్వామి వివేకానంద చికాగో నగరంలో ప్రసంగం చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించారని గుర్తు చేశారు. నివాళులు అర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవీ.బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.


స్వామివివేకానంవ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ తదితరులు

### సీతాఫల్‌మండి, బౌద్ధనగర్‌లో

బౌద్ధనగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నేషనల్ యూత్ డే సందర్భంగా నిర్వహించే స్వామివివేకానందా జయంతి వేడుకలు సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లో ఆదివారం జరిగాయి. మధురానగర్‌కాలనీ బీజేపీ కార్యాలయంలో యువ నాయకురాలు మేకల కీర్తిహర్షకిరణ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామి వివేకానందా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానందా క్యాంస విగ్రహం వద్ద బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్‌గౌడ్, బట్టల శ్రీను తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చిలకలగూడ బీజేపీ కార్యాలయం వద్ద ఎంసీఆర్ ప్రజా సేవ అధ్యక్షుడు, పార్టీ సీనియర్ నాయకుడు మేకల చంద్రశేఖరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు వివేకానంద స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


బోయినపల్లిలో స్వామివివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మర్రిలక్ష్మణ్‌రెడ్డి, జంపన ప్రతాప్


పద్మారావునగర్ కూడలిలో వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపి నాయకులు


ఆర్పీ రోడ్డులో నివాళులర్పించిన స్వామి వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు


లాలాపేట్‌లో నివాళులర్పిస్తున్న మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి, బీజేపీ నాయకులు